క్లుప్తంగా

లారీల కొరత లేకుండా చర్యలు


కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మన్నన్

చిన్నశంకరంపేట(మెదక్) : కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలించేందుకు లారీల కొరత లేకుండా చర్యలు చేపట్టామని చిన్నశంకరంపేట తహసీల్దార్ మన్నన్ తెలిపారు. శనివారం చిన్నశంకరంపేట మండలంలోని సూరారం, భాగీర్తిపల్లి, సంగాయిపల్లి గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కాంటా వేస్తున్న తీరును పరిశీలించారు. అలాగే ధాన్యం తరలింపుపై ఆరా తీశారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

విద్యుత్ వైర్లు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

శివ్వంపేట(నర్సాపూర్): అనుమతులు లేకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోటికి తరలించిన విషయం గురించి సాక్షి దినపత్రికలో ఈ నెల 1న కథనం ప్రచురితం కావడంతో విద్యుత్ సిబ్బంది స్పందించారు. ఏదైనా విద్యుత్ లైన్, ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు మార్చాల్సి ఉంటే సంబంధిత శాఖకు డీడీ చెల్లించి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అలా కాకుండా మండల పరిధి రత్నపూర్ గ్రామంలోని వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎలాంటి అనుమతుల లేకుండా మరోచోటికి తరలించారు. స్పందించిన అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వేసిన విద్యుత్ వైర్లను శనివారం తొలగించారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠాపన


నూతన విగ్రహాలను ప్రతిష్ఠించిన అర్చకులు

రేగోడ్(మెదక్): మండల కేంద్రం రేగోడ్‌లోని పోతులూరి వీర బ్రహ్మంగారి మఠం వద్ద విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు శనివారం ఘనంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చరణల మధ్య ధ్వజ స్తంభం, విగ్రహాల ప్రతిష్ఠ అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం నుంచి హోమాధికాలు, ప్రత్యేక పూజల నిర్వహణతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆయా గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో మఠం వద్ద సందడి మారింది. భక్తులకు తీర్థ, అన్న ప్రసాదం అందజేశారు.

అంబేడ్కర్‌ను గౌరవిస్తున్న బీజేపీ

ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్


అవగాహన కల్పిస్తున్న మల్లేశ్‌గౌడ్

నర్సాపూర్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను తమ పార్టీ సరైన రీతిలో గౌరవిస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ అన్నారు. పార్టీ పిలుపు మేరకు ఆయన రిటైర్డు ఉద్యోగులు, కుల సంఘాల ప్రతినిధులను శనివారం కలిసి అంబేడ్కర్‌పై తమ పార్టీ అనుసరిస్తున్న విధానాల గురించి వివరించారు. కాంగ్రెస్ పార్టీ అంబేడ్కర్‌ను అనేక విధాలుగా అవమానించిందని విమర్శించారు. కార్యక్రమంలో భాగంగా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు నాగభూషణ్, రిటైర్డు ఎలక్ట్రిసిటీ ఉద్యోగుల సంఘం ప్రతినిధి బుచ్చయ్య గుప్తాను సన్మానించారు. ఆయన వెంట నగేశ్, నగేశ్‌గౌడ్, రాంరెడ్డి, రాజు, కృష్ణ, తదితరులు ఉన్నారు.

రాజీవ్ యువ వికాస్ దరఖాస్తుల పరిశీలన


దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

అల్లాదుర్గం(మెదక్): మండలంలో రాజీవ్ యువ వికాస్ పథకానికి వచ్చిన దరఖాస్తులను ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు శనివారం పరిశీలించారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల పరిశీలకులు వీరేశం, యాదయ్య పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ కింద 230, ఎస్టీ కార్పొరేషన్ కింద 110 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, జూనియర్ అసిస్టెంట్ సజ్జద్ అలీ పాల్గొన్నారు.

మందకొడిగా ధాన్యం కొనుగోళ్లు

- పడిగాపులు కాస్తున్న రైతులు
- వేధిస్తున్న హమాలీల కొరత


నర్సాపూర్ కొనుగోలు కేంద్రంలో రైతులు ఆరపెట్టిన వడ్లు

నర్సాపూర్: ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. మండలవ్యాప్తంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో 16, ఐకేపీ ఆధ్వర్యంలో 11 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. సుమారు 15 రోజుల క్రితమే కొనుగోళ్లు ప్రారంభించినా, హమాలీలు లేక చాలా సెంటర్లలో తూకం ప్రారంభించలేదు. దీంతో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు పడాల్సి వస్తోంది.

తరుగు పేరుతో దోపిడీ

తరుగు పేరుతో కొనుగోలు కేంద్రాల్లో ఎక్కువ వడ్లు తూకం వేస్తున్నట్లు తెలుస్తోంది. 40 కిలోల వడ్ల బస్తాకు తరుగు కింద రెండున్నర కిలోల వడ్లు ఎక్కువ తూకం వేస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. బస్తాకు రెండున్నర కిలోలు ఎక్కువ తీసుకుంటూ దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కరువైందని వాపోతున్నారు.

టార్పాలిన్ల కొరత

కొనుగోలు కేంద్రాల్లో ప్రధానంగా టార్పాలిన్ల కొరత రైతులను ఇబ్బందులకు గురి చేస్తుంది. ప్రభుత్వం నుంచి సరిపడా టార్పాలిన్లు రాకపోవడంతో నిర్వాహకులు అందరికీ ఇవ్వలేకపోతున్నారు. ఒక్కో కొనుగోలు కేంద్రానికి సుమారు వంద మంది వరకు ధాన్యం తెస్తుండగా, పది టార్పాలిన్లు సరఫరా చేస్తే ఎలా సరిపోతాయని రైతులు ప్రశ్నిస్తున్నారు. అద్దెకు తెచ్చుకొని వడ్లను కాపాడుకుంటున్నామని చెబుతున్నారు. టార్పాలిన్ల అద్దె రోజుకు రూ. 20 నుంచి రూ. 30 వరకు చెల్లించాల్సి రావడంతో అదనపు భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కనీస వసతులు కరువు

ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు కరువయ్యాయి. అత్యవసర అవసరాలు తీర్చుకునేందుకు మహిళలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కనీసం తాగు నీటి సదుపాయం కల్పించకపోవడంతో ఎండకు అవస్థలు పడుతున్నారు. తప్పని పరిస్థితుల్లో ఇంటి నుంచి తెచ్చుకున్న నీటితో దాహం తీర్చుకుంటున్నామని రైతులు చెబుతున్నారు. ఇదే విషయమై ఏఎంసీ కార్యదర్శి ప్రతాప్‌గౌడ్‌ను వివరణ కోరగా.. తమ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో 80 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉన్నాయని, తమకు 1,500 టార్పాలిన్లు వచ్చాయని తెలిపారు. అన్ని సెంటర్లకు ఇప్పటికే సరఫరా చేశామని, ఇంకా టార్పాలిన్లు కావాలని సెంటర్ల నిర్వాహకులు అడిగితే సరఫరా చేస్తామని చెప్పారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేటలోని శ్రీగోదా సమేత లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం స్వామి వారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్ఛరణలతో స్వామివారి కల్యాణ మహోత్సవం కేంద్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ విగ్రాం శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో కన్నుల పండువగా జరిపించారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి స్వామివారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు


ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

పెద్దశంకరంపేట(మెదక్): వరి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం పెద్దశంకరంపేటలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు ఆందోళన చెందొద్దని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ రవీందర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

చేగుంట(తూప్రాన్): మండలంలోని వడియారం ధాన్యం కొనుగోలు కేంద్రంను తహసీల్దార్ శ్రీకాంత్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ధాన్యం తరలింపునకు లారీల కొరత ఉన్నందున స్థానికంగా ట్రాక్టర్ యజమానులు డీసీఎం వ్యానుల యజమానులు ధాన్యం తరలింపునకు వాహనాలను ఏర్పాటు చేస్తే అద్దెను చెల్లిస్తామని తహసీల్దార్ తెలిపారు. ఈ పరిశీలనలో కొనుగోలు కేంద్రం నిర్వాహకులు స్థానిక రైతులు ఉన్నారు.

సమ్మర్ క్యాంపులతో నైపుణ్యం మెరుగు

ఎంఈఓ బాలరాజు


శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓ బాలరాజు

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థుల్లోని నైపుణ్యం వెలికితీసేందుకే తీసేందుకే సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ బాలరాజు పేర్కొన్నారు. శనివారం కౌడిపల్లిలోని బాలికల పాఠశాలలో అండర్- 14 విద్యార్థులకు క్రీడలు, యోగా, డ్రాయింగ్, కంప్యూటర్ ఆపరేటింగ్‌పై వేసవి శిక్షణ శిబిరం పారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పక్షం రోజులపాటు జరిగే శిక్షణలో విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మండల టాపర్లకు సన్మానం

పది ఫలితాల్లో మండలంలో ప్రథమ స్థానం వచ్చిన వెల్మకన్న ఉన్నత పాఠశాల విద్యార్థిని రాజేశ్వరీ(576), తృతీయ స్థానం వచ్చిన కౌడిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని అఫాన(562)లను ఎంఈఓ బాలరాజు సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు పద్మజ, చందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు క్రిష్ణ, జ్ఞానప్రకాష్, సీఆర్‌పీలు అంజయ్య, స్వప్న, ఎంఐఎస్ ఆంజనేయులు, ట్రైనర్స్ సత్యం, కరుణాకర్, యాదగిరి గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

పెద్దశంకరంపేట(మెదక్): విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి వెంకటేశం అన్నారు. శనివారం పెద్దశంకరంపేటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 రోజుల పాటు స్టిచ్చింగ్, యోగా, ఆటలు, పాటలు, డ్రాయింగ్ తదితర అంశాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్, సత్య కుమార్, సిద్ధిరాములు, సుధీర్, సిబ్బంది సంపత్ రెడ్డి, సంగమేశ్వర్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు ధ్వంసం

– నలుగురిపై కేసు నమోదు

మనోహరాబాద్(తూప్రాన్): విద్యుత్ స్తంభాలను ధ్వంసం చేసిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేయించినట్లు కాళ్లకల్ విద్యుత్ ఇన్‌చార్జి ఏఈ వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. ఏఈ కథనం మేరకు.. మండలంలోని కాళ్లకల్ గ్రామానికి చెందిన సత్తి వెంకటేశ్, యాదగిరి తమ స్థలం వద్ద పనులు చేస్తూ విద్యుత్ స్తంభాలను ధ్వంసం చేశారని, వారికి సహకరించిన ఖమర్, ఎలక్ట్రీషన్ నగేశ్‌పై మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పేలుళ్లతో ఇబ్బందులు

శివ్వంపేట(నర్సాపూర్): బండరాళ్ల పేలుళ్లతో పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని దొంతి బండపై, ఉసిరికపల్లి గ్రామ పరిధిలో ఉన్న గుట్టలు (బండరాళ్లు) ఇష్టారాజ్యంగా రాత్రి వేళల్లో పేల్చుతుండటం వల్ల భారీ శబ్దంతో శివ్వంపేటతో పాటు పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శబ్ద కాలుష్యంతో పాటు పలు నివాస ఇండ్లకు పగుళ్లు వస్తున్నాయని గ్రామస్తులు శ్రీనివాస్‌గౌడ్, కృష్ణ, గన్యా, రమేష్‌లు ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

కొనుగోలు కేంద్రం తనిఖీ


కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్

అల్లాదుర్గం(మెదక్): మండలంలోని గడిపెద్దాపూర్ గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ మల్లయ్య శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని సిబ్బందిని ఆదేశించారు.

సమ్మర్ క్యాంపుతో లబ్ధి

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉచితంగా సమ్మర్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నామని, విద్యార్థులు, యువకులు వినియోగించుకోవాలని హెచ్ఎం సాంబయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డ్రాయింగ్, పెయింటింగ్, డ్యాన్స్, చేతిరాత, యోగా, తదితర వాటిపై శిక్షణను ఇస్తున్నామన్నారు. ఈ నెల 5 నుంచి 20 వరకు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు శిక్షణ తరగతులుంటాయన్నారు.

ఆక్రమణకు గురైన కాలువ పరిశీలన


హల్దీవాగు ఎడమ కాలువను సర్వే చేస్తున్న అధికారులు

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి మండల శేరిల గ్రామ శివారులోని పబ్బ చెరువు నుంచి వెల్దుర్తిలో గల నీటిపారుదల శాఖ అతిథి గృహం వరకు హల్దీ ప్రాజెక్టు ఎడమ కాలువను రైతులు పూడ్చి పొలాలు చేసుకున్నారు. దీంతో కింద ఉన్న పంట పొలాల వరకు సాగునీరు పారడం లేదు. రైతులు కాలువ ఆక్రమణపై అధికారులకు సమాచారం అందించగా శనివారం ఇరిగేషన్ డీఈ రాజేందర్, గిర్దావర్ నర్సింగ్‌యాదవ్‌లు ఘటనా స్థలాన్ని సందర్శించి ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలించారు. వెంటనే ఎడమ కాలువకు సంబంధించి సర్వే చేసి హద్దులను నిర్ణయించారు. అలాగే ఆక్రమణకు గురైన కాలువ నుంచి మట్టిని తీసుకెళ్తామని రైతులు ముందుకు రావడంతో అధికారులు అంగీకరించారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్‌రూరల్: డిగ్రీలో చేరే విద్యార్థులు దోస్త్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనిత అబ్రహం తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో డిగ్రీలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మొదటి విడత ఈనెల 3 నుంచి 21వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరిస్తారని, మళ్లీ మే 10 నుంచి 22 వరకు వెబ్ ఆప్షన్స్‌కు అవకాశం కల్పిస్తారని చెప్పారు. మే 29న మొదటి విడత సీట్ల కేటాయిస్తారని తెలిపారు. అదే విధంగా రెండో విడతలో భాగంగా మే 30 నుంచి జూన్ 8 వరకు దరఖాస్తుల స్వీకరణ, మే 30 నుంచి జూన్ 9 వరకు వెబ్ ఆప్షన్స్, జూన్ 13న సీట్ల కేటాయింపు ఉంటుందని చెప్పారు. మూడో విడతలో భాగంగా జూన్ 13 నుంచి 19వరకు దరఖాస్తుల స్వీకరణతో పాటు వెబ్ ఆప్షన్స్‌కు అవకాశం ఉంటుందని, జూన్ 22న సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. జూన్ 30 నుంచి తరగతులు ప్రారంభవుతాయని తెలిపారు. కళాశాలలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలలో బీఏ, బీకాం(కంప్యూటర్స్), బీఎస్సీ అన్ని గ్రూపులున్నాయని, అదే విధంగా ఈ విద్యా సంవత్సరం నుంచి బీబీఏ కోర్సు కూడా ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు దోస్త్ కళాశాల కోడ్ 16029ను ఎంచుకోవాలని సూచించారు.

టీచర్స్ అసోసియేషన్ కార్యవర్గం

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎంపికచేశారు. నూతన అధ్యక్షుడిగా అందె రామచంద్రం, ప్రధాన కార్యదర్శిగా గజబింకార్ రాజు, ఉపాధ్యక్షులుగా సాహెబ్ హుస్సేన్, అన్నెబోయిన శ్రీనివాస్, కోశాధికారిగా నేరండ్ల నరేశ్, సహాయ కోశాధికారిగా తోకల శ్రీకాంత్, ప్రధాన సలహాదారుడిగా ర్యాకం మల్లేశం, మద్దెల రామచంద్రం, జాకీర్ హుస్సేన్, ఇరుకుల్ల శ్రీనివాస్, గడ్డం కృష్ణ, అనిల్, సాయిలు, కుమార్, రమేశ్ తదితరులను ఎంపికచేశారు. రామచంద్రం మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు సహాయం చేస్తానన్నారు.

ఘనంగా పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణం


సేవలాల్ మహరాజ్‌ను దర్శించుకొంటున్న మైనంపల్లి

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో ముదిరాజు కులస్తులు శనివారం పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో చింతల స్వామి, రంగ రవి, ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి పూజలు

పెద్దమ్మ ఆలయంలో మాజీ మైనంపల్లి ఎమ్మెల్యే హనుమంతరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జెడ్ చెరువు తండాలోని సేవలాల్ మహరాజ్‌ను దర్శించుకొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో ఫ్లాగ్ మార్చ్


పట్టణ పోలీస్ స్టేషన్‌లో రాపిడ్ యాక్షన్ ఫోర్స్

మెదక్ మున్సిపాలిటీ: రాపిడ్ యాక్షన్ ఫోర్స్ బృందం శనివారం మెదక్ జిల్లా కేంద్రంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలోని ఏ రాష్ట్రంలోనైనా శాంతిభద్రతల సమస్య తలెత్తినప్పుడు, మత ఘర్షణలు జరుగుతున్నప్పుడు అదుపు చేయడం ఈ ఫోర్స్ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలో ఈ ఫోర్స్ పని చేస్తుందన్నారు. రాష్ట్రంలోని హకీంపేట్, సికింద్రాబాద్ నందు 99 బెటాలియన్ ఉన్నట్లు తెలిపారు. మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మెదక్ ఏఆర్ డీఎస్పీ రంగా నాయక్, మెదక్ టౌన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మూగజీవాల పాలిట మృత్యుపాశాలు

- ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు
- ఆందోళనలో రైతులు, స్థానికులు


మృత్యువాత పడిన మేక

నర్సాపూర్ రూరల్: మండలంలోని కొన్ని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మూగజీవాలకు మృత్యు పాశాలుగా మారాయి. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని రైతులు భయాందోళనలో బతుకుతున్నారు. ఎర్రకుంట పంచాయతీ పరిధిలోని బాల్యతండాలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్రకుంటతండాకు చెందిన మాలోత్ శంకర్ మేకలు మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు ఒక మేక విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. అంతే కాకుండా మండలంలోని పలు గ్రామాల్లో పాడి గేదెలు, కోళ్లు, మేకలు, గొర్రెలు ఇతర మూగజీవాలు మృత్యువాత పడిన ఘటనలు చాలానే ఉన్నాయి. దీంతో పశువుల, మేకల కాపరులు తీవ్రంగా నష్టపోతున్నారు. అలాగే మండలంలోని చిప్పల్ తుర్తి, నారాయణపూర్, లింగాపూర్, బ్రాహ్మణపల్లి, తుజాల్ పూర్, తిరుమలాపూర్ తదితర గ్రామాలతో పాటు పలు గిరిజన తండాలలో చాలా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అధికారులు ఎటువంటి కంచెలు ఏర్పాటు చేయలేదు. అదేవిధంగా కొన్ని చోట్ల గద్దెలు ధ్వంసం కావడం, మరి కొన్నిచోట్ల తక్కువ ఎత్తులో గద్దెలు నిర్మించడంతో ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. విద్యుత్ శాఖ అధికారులు గ్రామాల్లో పరిశీలించి కంచెలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **చెరువుకట్ట మరమ్మతులు**

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కోనాయపల్లి(పీటీ) గ్రామ పంచాయతీ పరిధిలోని ధర్మరాజ్‌పల్లి గ్రామ ఊర చెరువు కట్ట పునఃవ్యవస్థీకరణ పనులను ఐటీసీ మనోహరాబాద్ పరిశ్రమ ఆధ్వర్యంలో శనివారం చేపట్టారు. కార్యక్రమంలో తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, ఐటీసీ ప్రతినిధులు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

◆ **రేపు ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ**

శివ్వంపేట(నర్సాపూర్) : మండల పరిధి పిల్లుట్ల గ్రామంలో నెలకొల్పిన శివాజీ మహరాజ్ విగ్రహావిష్కణ సోమవారం చేస్తున్నట్లు విగ్రహ దాత బండారి గంగాధర్ తెలిపారు.

◆ **హార్డు కాపీలు అందజేయండి**

మనోహరాబాద్(తూప్రాన్): ప్రభుత్వం పథకంలో భాగంగా రాజీవ్ యువ వికాసం కోసం దరఖాస్తులు చేసుకున్న వారు తమ హార్డుకాపీలను ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి కోరారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 17 గ్రామాలకు చెందిన 673 యువకులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారని తెలిపారు. వీరిలో 472 మంది మాత్రమే తమ హార్డు కాపీలను అందజేశారని.. మిగతా 201 మంది అందజేయలేదన్నారు. అందజేయని వారు తమ ఆదాయ, కులపత్రాలతో పాటు, బ్యాంకు ఖాతాల జిరాక్స్‌లను అందజేయాలన్నారు.

◆ **హోటళ్లు తనిఖీలు**



మెదక్ మున్సిపాలిటీ: మెదక్ మున్సిపల్ అధికారులు సిబ్బంది శనివారం పట్టణంలోని పలు బేకరీలు, హోటళ్లను ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. పరిశుభ్రత, నిబంధనలు పాటించని పలు బేకరీలు, హోటళ్ల యజమానులకు జరిమానాలు విధించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్, పర్యావరణ ఇంజనీర్ వెంకటేష్, జవాన్లు పాల్గొన్నారు.

◆ **ఎండు గంజాయి స్వాధీనం**

నర్సాపూర్ రూరల్: అక్రమంగా తరలిస్తున్న ఎండు గంజాయి పట్టుకున్నట్లు నర్సాపూర్ ఎక్సైజ్ సీఐ గోపాల్ శనివారం తెలిపారు. నర్సాపూర్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని తూప్రాన్ లోని నర్సాపూర్ చౌరస్తా వద్ద ఇద్దరు వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం అందింది. అక్కడికి వెళ్లి చూడగా బిహార్‌కు చెందిన ముఖాంశు వద్ద 1,300 గ్రాముల ఎండు గంజాయి దొరికింది. వెంటనే అతడిని అదుపులోకి తీసుకున్నాం. వెంట ఉన్న తూప్రాన్‌కు చెందిన నర్సింలు అనే వ్యక్తి పారిపోయినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

◆ **తాళం వేసిన ఇంట్లో చోరీ**

కౌడిపల్లి(నర్సాపూర్): తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన మండలంలోని దేవులపల్లి పంచాయతీ పరిధిలోని కోమటికుంట తండాలో చోటు చేసుకుంది. శనివారం ఎస్ఐ రంజిత్‌రెడ్డి కథనం మేరకు.. కోమటికుంట తండాకు చెందిన గూగ్లోత్ రమేశ్ కుటుంబ సభ్యులతో కలిసి గత నెల 24న జంగరాయితండాలోని బంధువుల పెళ్లికి వెళ్లాడు. అంతకు ముందు రూ.80 వేలు ఇంట్లో బీరువాలో పెట్టి వెళ్లినట్లు బాధితులు తెలిపారు. శనివారం ఇంటికొచ్చి చూడగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి ఇంట్లో చొరబడి నగదును చోరీ చేసినట్లు వాపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పంటల పరిశీలన

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని ధర్మారం, పీర్లపల్లి, ఇటిక్యాల, అలిరాజ్‌పేట, జగదేవ్‌పూర్, దౌలాపూర్ గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం కురిసిన వడగళ్ల వర్షానికి నష్టపోయిన పంటలను శనివారం మండల వ్యవసాయ విస్తీరణ అధికారులు పరిశీలించారు. ఏఈఓలు ఖలీల్, కిరణ్, కృష్ణమూర్తి, రేఖ, మమత ఆయా గ్రామాల్లో రైతుల పొలాలను వద్దకు వెళ్లి నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 330 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లిందన్నారు. ప్రాథమికంగా అంచనా వేశామని, ఆయా రైతుల వివరాలను పై అధికారులకు నివేదిస్తామని చెప్పారు.